10న చలో ఇందిరాపార్కు



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

నిజాంపేట్: కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో 10న ఉదయం 10 గంటలకు ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాకు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని నాయకులు కోరారు. శనివారం ప్రగతినగర్ సుందరయ్య భవన్‌లో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు బి.వెంకట రామయ్య మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను కేంద్రం కాలరాస్తోందన్నారు. బడ్జెట్‌లో కార్మిక రంగానికి ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో ఎం.చంద్రశేఖర్, బాలపీరు దితరులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాల్లో రాజ్యాంగాన్ని పొందుపర్చాలి

కుత్బుల్లాపూర్: భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశాల్లో పొందు పరిచినపుడే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నిజమైన నివాళి అని డీసీసీ మాజీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ అన్నారు. శనివారం ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షుడు అవిజే జేమ్స్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ప్రతాప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్యాంగంలో పొందుపరిచిన విషయాలు, ఆర్టికల్స్‌లను పాఠ్య పుస్తకాల్లో ముద్రించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ యేసు రత్నం, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ అమర్ బాబు, హెచ్ఏఎల్ కార్మిక సంఘం నాయకుడు సత్తయ్య, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో



సైన్స్ ఎక్స్‌పోలో నమూనాలను ప్రదర్శిస్తున్న త్రివేణి స్కూల్ విద్యార్థులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ సుచిత్ర త్రివేణి బ్రాంచ్ స్కూల్‌లో శనివారం సైన్స్ ఎక్స్‌పో సందర్శకులను ఆకట్టుకుంది. నర్సరీ నంచి 7వ తరగతికి చెందిన 200 మంది విద్యార్థులు వివిధ అంశాలపై సైన్స్ ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. చంద్రయాన్ 3, శాస్త్ర సాంకేతిక అంశాలపై మోడల్స్ రూపొందించిన విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. కార్యక్రమాన్ని మిడిల్ ఏజ్ బయోపిక్ ఫేం మౌళి, ప్రముఖ యూట్యూబర్ జై కృష్ణ హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి సైన్స్ ఎక్స్‌పోలు దోహద పడతాయన్నారు. ఎక్స్‌పోలో పాఠశాల సీఆర్‌ఓ వెంకట్రావు, ప్రిన్సిపాల్ వాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

శామీర్‌పేట్: యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ సాంబశివ రావు అన్నారు. శనివారం శామీర్ పేట మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి, ఈజీఎం ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం అందించే పథకాలను వినియోగించుకొని, స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మమతాబాయి, జిల్లా జాబ్స్ మేనేజర్ దివాకర్, శివప్రసాద్, ఏపీఎం సురేష్‌రెడ్డి, జాబ్స్ ట్రైనర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాకు 142 మంది యువతీ యువకులు హాజరయ్యారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మేడ్చల్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మన్మధ్ తెలిపిన వివరాల ప్రకారం..ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని సాలూరిపేటకు చెందిన కన్నా(40) మేడ్చల్‌కు వలసవచ్చి కిష్టాపూర్ రోడ్డులో ఉన్న ఓ సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రంలో కార్మికుడిగా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. తోటి కార్మికుడు సైతం అతనితో పాటు నివాసం ఉంటున్నారు. కొద్ది రోజులుగా మద్యానికి బానిసైన కన్నా శుక్రవారం రాత్రి గదిలో నిద్రించాడు. శనివారం ఉదయం తోటి కార్మికుడు గదిలోకి వెళ్లి చూడగా శవమై కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు క్లూస్‌టీంతో పలు ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై గాయాలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు తోటి కార్మికుడిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య గొడవ జరిగి తోటి కార్మికుడు హత్య చేశాడా లేక మృతుడు మద్యం ఎక్కువగా సేవించడం వల్ల మరణించాడా అనే కోణంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో కార్పొరేట్ వైద్య సేవలు

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేద ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జగద్గిరి గుట్ట దేవమ్మ బస్తీకి చెందిన రమేష్, సూరారం కాలనీ ఎన్టీఆర్ నగర్‌కు చెందిన సునందకు రూ.1.75 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

◆ చింతల్‌లోని అమృతాలయం వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలతో



చింతల్‌లోని అమృతాలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

ఆధ్యాత్మికత పెంపొంది మనసుకు ప్రశాంతత చేకూతుందన్నారు. కార్యక్రమంలో బొడ్డు వెంకటేశ్వరరావు, మీసాల నరసింహ, బాపు యాదగిరి, సంజీవరెడ్డి, ఆంజనేయులు చారి, కిషోర్ చారి, బొడ్డు రవి తదితరులు పాల్గొన్నారు.

◆ రాజీవ్ గాంధీనగర్ నల్లగుట్ట పైన వెలిసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం 24వ ద్వాదశ జ్యోతిర్లింగాల శివ పూజ మహోత్సవం పోస్టర్‌ను ఎమ్మెల్యే వివేకానంద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శివ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

◆ బీఆర్ఎస్ శాసనసభ విప్‌గా నియమితులైన ఎమ్మెల్యే వివేకానంద్‌కు శనివారం బీఆర్ఎస్ శ్రేణులు సన్మానం చేశారు. పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, నియోజక వర్గ యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, దుండిగల్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, జీహెచ్ఎంసీ డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, విజయరామిరెడ్డి, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్ పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ, రేణుకా ఎల్లమ్మ జాతర షురూ



అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు



ఒడి బియ్యం పోస్తున్న మహిళలు

సుభాష్‌నగర్: సూరారంలోని కట్ట మైసమ్మ, రేణుకాఎల్లమ్మ ఆలయ జాతర శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ పరిసర ప్రాంతాల్లో అర కిలోమీటర్ వరకు మైకులు ఏర్పాటు చేశారు. సూరారం ప్రధాన రోడ్డులో స్వాగత తోరణాలు, వివిధ రాజకీయ పార్టీల బ్యానర్లు వెలిశాయి. ఆలయ ప్రాంగణంలో దుకాణాలు, చిన్నపిల్లల కోసం వినోదం, ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. మొదటి రోజు గణపతి పూజ, కల్యాణం ఒడి బియ్యం, సూరారం గ్రామం నుండి అమ్మవార్ల ఊరేగింపు జరిగింది.

నేడు ప్రధాన జాతర

ఆదివారం అమ్మవారి ప్రధాన జాతర జరుగనుంది. ఉదయం కుంకుమార్చన, ఒడిబియ్యాలు, బోనాలు జరగనున్నాయి. ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. శనివారం రాత్రి నుంచే ట్రాఫిక్ పోలీసులు భారీ వాహనాలను బహదూర్‌పల్లి, దూలపల్లి, జీడిమెట్ల పారిశ్రామికవాడ రోడ్ల మీదుగా మళ్లించారు.

అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి



సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మోతీనగర్: అభివృద్ధే ధ్యేయంగా సంక్షేమ సంఘాలు పని చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. శనివారం అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్షేమ సంఘం కార్యాలయాన్ని కార్పొరేటర్ సబిహా బేగం, అధ్యక్షులు బుల్లు శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలు ఎన్నికల సమయంలో మాత్రమేనని, మిగిలిన సమయాల్లో అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో తుంగం శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షులు జగన్నాథం, సభ్యులు సత్యనారాయణ, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, కో ఆర్డినేటర్ తిమ్మారెడ్డి వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు



షాపూర్‌నగర్‌లో సంబురాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: ఢిల్లీలో బీజేపీ ఘన విజయం సాధించిన సందర్భంగా షాపూర్‌నగర్ చౌరస్తాలో ఆ పార్టీ నాయకులు బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, నాయకులు నందనం దివాకర్, కార్పొరేటర్ రావుల శేషగిరి, బక్క శంకర్ రెడ్డి, వాసు, కేశవ్ యాదవ్, పత్తి రఘుపతి, కంది శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కొంపల్లిలో...

కుత్బుల్లాపూర్: ప్రధాని మోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం దేశాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో శనివారం కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు సతీష్‌సాగర్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీ ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని, అభివృద్ధి, పారదర్శకత, జవాబుదారితనానికి నిదర్శమైన బీజేపీకి పట్టం కట్టారన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ ప్రచారం నిర్వహించిన ఘెుండా అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి అజయ్ మహావర్ భారీ మెజారిటీతో విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు.

నిజాంపేట్: బాచుపల్లి అధ్యక్షులు ప్రసాద్ రాజు ఆధ్వర్యంలో కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మాధవి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జె.కె. శేఖర్ యాదవ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కొంపల్లి ర్యాలీలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి తదితరులు



సంబురాల్లో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. పాపిరెడ్డి కాలనీకి చెందిన మనోజ్‌కుమార్‌కు రూ.3 లక్షలు, ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయిచరణ్ కాలనీకి చెందిన భీమరాజుకు రూ.1.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో సాంబయ్య, ఖాసీం, లియాకాత్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరికరాలు అందించడం అభినందనీయం

ఓల్డ్‌బోయిన్‌పల్లి: పేద ప్రజల కోసం ఆసరా మెడికల్ వైద్య పరికరాల బ్యాంక్ స్వచ్ఛంద సంస్థ రోగులకు అవసరమయ్యే వివిధ వైద్య పరికరాలను ఉచితంగా అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని మదర్సాలో వైద్య పరికరాల సెంటర్‌ను కార్పొరేటర్ నర్సింహయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని పేద వారి కోసం వీల్ చైర్స్, బెడ్స్, ఎయిర్ మ్యాట్‌రిస్, వాకింగ్ స్టాండ్, బీపీ మిషన్ వంటి పరికరాలను అందుబాటులో ఉంచారని, రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇలాంటి పరికరాలు అవసరమయ్యే వారు సెంటర్‌కు వచ్చి అడిగితే ఉచితంగా ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆసరా సంస్థ చైర్మన్ ఇలియాజ్ షంషీ, వైద్య పరికరాల కో ఆర్డినేటర్ అతేర్ పర్విజ్, నదీమ్ పటేల్, ఖలీల్ పాల్గొన్నారు.



మదర్సాలో వైద్య పరికరాల సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఫుట్‌పాత్ వ్యాపారాలకు ఇబ్బందులు కలిగించొద్దు



ఫుట్‌పాత్ వ్యాపార కేంద్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేశ్

కంటోన్మెంట్: ఫుట్‌పాత్ వ్యాపారాలకు ఇబ్బందులు కలిగించవద్దని ఎమ్మెల్యే శ్రీ గణేశ్ ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. మారేడ్‌పల్లిలోని వ్యాపార కేంద్రాలను ట్రాఫిక్ పోలీసులతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సికింద్రాబాద్ కోర్ట్ సమీపంలోని ఫుట్‌పాత్‌లపై ఎన్నో ఏళ్లుగా పదుల సంఖ్యలో డాక్యుమెంట్ రైటర్లు జీవనోపాధి పొందుతున్నారన్నారు. ఇటీవల ట్రాఫిక్ పోలీసులు ఆయా దుకాణాలను తొలగించాలని చూస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుని ఆయా వ్యాపారాలు యథావిధిగా కొనసాగించుకునేలా చూడాలన్నారు. తమ విజ్ఞప్తి మేరకు పర్యటించి సమస్యకు పరిష్కారం చూపడంతో ఫుట్‌పాత్ వ్యాపారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా..





వివేకానందనగర్ కాలనీ పార్కు వద్ద ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్, ఫ్యూజ్‌బాక్స్

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలో విద్యుత్ స్తంభాల వద్ద తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. గాలులకు షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇళ్ల ముందు వేలాడుతుండడంతో బాటు మరికొన్ని వైర్లు అతుకులతో కూడి ప్రమాదకరంగా మారాయి. ఒక్కో వైరుకు సుమారు 10 చోట్ల అతుకులు ఉన్నాయని, చిన్నపాటి గాలులకే తెగిపడే ప్రమాదం ఉందని స్థానికులు తెలిపారు. వర్షాకాలంలో కొన్ని వీధుల్లో చెట్లు పడిపోయి, వైర్లు తెగి స్తంభాలు కూలిన ఘటనలు కూడా ఉన్నాయని చెప్పారు. విద్యుత్ వైర్లు గాలులకు ఊగకుండా ప్లాస్టిక్ వస్తువులను ఏర్పాటు చేసి మమ అనిపించుకుంటున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాల్సి వస్తుందని చెప్పారు. పార్కుల ముందు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కంచె లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. చిన్నారులు పొరపాటున ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకితే ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వేసవి కాలంను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ వైర్లు సరిచేయాలని, ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో కొత్త వైర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చింతల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 33/11 కెవి ఐడీపీఎల్ సబ్ స్టేషన్ విజయ్ ఎలక్ట్రికల్స్ ఫీడర్ పరిధిలో మెగా ఇంజినీరింగ్ బిల్డింగ్స్, ఐడీపీ బాలానగర్, టీఐఈ బాలానగర్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐడీపీఎల్ సబ్ స్టేషన్ పంప్ హౌస్ ఫీడర్ పరిధిలో పంప్ హౌస్, శ్రీసాయినగర్, సోనీ కాంప్లెక్స్, స్థాయిరామ్ హోటల్ తదితర ప్రాంతాలు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రశాంత్‌నగర్ సబ్ స్టేషన్ కోల్గేట్ ఫీడర్ పరిధిలో వెంకటేష్ నగర్, బీఎస్‌పి స్టీల్స్, వెంకటేశ్వరనగర్, విష్ణుప్రియ లాడ్జ్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

చెట్ల పొదల్లో నెలల చిన్నారి మృతదేహం

మేడిపల్లి: అభం శుభం తెలియని నెలల చిన్నారి చెట్ల పొదల్లో మృతి చెంది కనిపించింది. మానవత్వం మరిచారో.. శిశువుని వదిలించుకోవాలని చెట్ల పొదల్లో విసిరేశారో వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారిలో ఉన్న డెకత్లాన్ షోరూం సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ఉన్న చెట్ల పొదల్లో చిన్నారి మృతదేహాన్ని చూసిన స్థానికులు 100 డయల్ చేసి సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. అప్పటికే కుళ్లిపోయిన స్థితిలో చిన్నారి మృతదేహం ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో గృహిణి ఆత్మహత్య

మూసాపేట: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా, గిద్దనపల్లి గ్రామానికి చెందిన కనకరత్నం, సత్తిబాబు దంపతులు కూకట్‌పల్లిలోని సుమిత్రనగర్‌లో నివాసం ఉంటున్నారు. భర్త సెంట్రింగ్ పని, కొడుకు మేస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నారు. శుక్రవారం డబ్బులు చెల్లించేది ఉండగా.. ఆ విషయాన్ని తీవ్రంగా ఆలోచిస్తూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవం

కీసర: రాంపల్లిలోని మహంకాళి ఆలయ కుంభాభిషేక మహోత్సవం వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం మహంకాళి అమ్మవారి కుంభాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపులో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం అమ్మవారి అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం, సాయంత్రం బోనాల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు మహంకాళి దేవస్థానం చైర్మన్ ఎలసాని భూమయ్య తెలిపారు. పూజల్లో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, నేతలు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, గండి అంజయ్య గౌడ్, వరకాల పెంటయ్య, నర్సింహారెడ్డి, రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, క్యాసారం అశోక్‌గౌడ్, రామకృష్ణారెడ్డి, మచ్చ శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో రాంపల్లి వాసులు

సద్గురు సాయిబాబా ఆలయ వేడుకలు ప్రారంభం



హోమంలో పాల్గొన్న భక్తులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్ శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో సద్గురు సాయిబాబా ఆలయ 23వ వార్షిక వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కాగడ హారతి, నిత్యారాధన, సాయి దత్త మూలమంత్ర ఆహ్వానం, మధ్యాహ్నం హారతి, విష్ణుసహస్రనామ పారాయణం, సంధ్యహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవదాయ ధర్మాదాయ శాఖ ఆలయ కార్యనిర్వాహణ అధికారి సుధాకర్ మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి



అడ్డగుట్ట: నేరాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేయాలని నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ సూచించారు. తుకారం గేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడ్డగుట్ట, మరాఠా బస్తీ, సాయినగర్, బోయబస్తీ, వడ్డెరబస్తీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి ఆమె ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్ స్థానిక ప్రాంతాల గురించి ఆమెకు వివరించారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. అర్ధరాత్రి రోడ్లు, బస్తీల్లో సంచరించే అల్లరి మూకలపై చర్యలు తప్పవన్నారు.

సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌రెడ్డి

పోచారం: మొబైల్ షాపులో సెల్‌ఫోన్లు చోరీ చేసిన దొంగలు పోలీసులకు చిక్కారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ సీఐ రాజు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌రెడ్డి, వారి బృందం ఉప్పల్ భగాయత్‌లో నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. పోచారం, మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని మొబైల్ షాపుల్లో సెల్‌ఫోన్లు చోరీ చేసినట్లు విచారణలో అంగీకరించారు. ఉప్పల్ భగాయత్‌లో నిందితుల వద్ద లభించిన ఫోన్లతో పాటు నారపల్లిలోని నందనవనం దగ్గర రోడ్డు పక్కనే ఉన్న పొదల్లో దాచిన కారం, ఇనుప రాడ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు రాజస్తాన్‌కు చెందిన ప్రభాత్ సింగ్ (24), నేపాల్ సింగ్ (25), తరుణ్ పాల్ సింగ్ (22), ప్రవీణ్ సింగ్ (21)గా గుర్తించారు. వీరిలో తరుణ్ సింగ్ కాస్మొటిక్ షాప్‌లో పనిచేస్తుండగా, మిగిలిన ముగ్గురు ఆటో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఈ నలుగురు, పరారీలో ఉన్న మరో ఇద్దరు రాజస్తానీయులతో కలిసి ఓ బృందంగా ఏర్పడ్డారు. గూడ్స్ వ్యాన్‌లో ఇనుప రాడ్లు, గడ్డపారలను తీసుకొచ్చి మొబైల్ షాపు షట్టర్స్ తెరిచి సెల్ ఫోన్లను చోరీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 3న మీర్‌పేట్, 4న అన్నోజిగూడలోని షాపుల్లో సెల్ ఫోన్లు దొంగిలించారు. ఎవరైనా అడ్డుపడితే దాడి చేయడానికి కారం, ఇనుపరాడ్లను కూడా వెంట తెచ్చుకుంటారు. నిందితులను అరెస్ట్ చేసి, 60 సెల్ ఫోన్లు, టీవీ, 2 సౌండ్ బార్లు, సీసీటీవీ మానిటర్, 2 ఇనుప రాడ్లు, కారం ప్యాకెట్, 5 నెక్ బ్యాండ్లు, 4 చార్జర్లు, 5 డేటా కేబుళ్లు, చార్జింగ్ కేబుల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 11.75 లక్షలు ఉంటుంది.